

జ్వాలా తోరణానికి నూలు వత్తులు



శ్రీశైలంలో జ్వాలాతోరణానికి ఉపయోగించే నూలు వత్తులను బాపట్ల జిల్లా వేటపాలెం మండలం ఆమోదగిరిపట్నానికి చెందిన వసుంధరరావు, రామకృష్ణారావు కుటుంబసభ్యులు సమర్పించారు. బుధవారం ఉదయం ఆలయం లోకి వచ్చి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్వాలాతోరణ దర్శనంతో దృష్టి దోష నివారణ జరుగుతుందని భక్తుల నమ్మకం. ● శ్రీశైలం



బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో దీపోత్సవం



యాగంటి క్షేత్రంలో...



శ్రీశైలంలో పాతాళగంగలో దీపాలు వదలుతున్న భక్తులు



శ్రీశైలంలోజ్వాలా తోరణం

శ్రీగిరిపై పౌర్ణమి వెలుగులు

కార్తీక మాసం సందర్భంగా జ్వాలా తోరణం



శ్రీశైలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీగిరి మహాక్షేత్రంలో కార్తీక పౌర్ణమి శోభాయమానంగా కాంతులీనింది. తెల్లవారు జాము నుంచి భక్తులు నదిలో పుణ్యస్నానాలు చేసుకుని ఆలయ ప్రధానవీధిలో దీపాలు వెలిగించారు. స్వామి, అమ్మవార్ల ఉభయ దేవాలయాల్లో గంట సమయంలోనే అలంకార దర్శనం చేసుకున్నారు. సుమారు 50వేల మంది భక్తులు క్షేత్ర సందర్శనం చేశారని ఆలయ అధికారులు వెల్లడించారు. జ్వాలా తోరణం సజావుగా సాగేందుకు చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్లను ఈవో శ్రీనివాసరావుతో పాటు ఎస్పీ సునీల్ షెరాన్ పరిశీలించారు. ప్రధానంగా యాత్రికుల తిరుగు ప్రయాణాలు, ట్రాఫిక్ జాం వంటి సమస్యలు తలెత్తకుండా సిబ్బందికి సూచనలిచ్చారు. అదే విధంగా మాసోత్సవాల్లో దేవస్థానం చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లను కూడా పరిశీలించారు.

మరిన్ని వార్తలు 6వ పేజీలో



జ్వాలా తోరణంలో పాల్గొన్న భక్తులు

మహానందిలో కార్తీక శోభ

దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మహానంది, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహానందిలో కార్తీక పౌర్ణమి శోభాయమానంగా నిర్వహించారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి వేకువజాముననే భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయాల్లో జరిగే పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరుతోపాటు రెండో ప్రాకారంలోని కోనేర్లల్లో భక్తులు కుటుంబ సమేతంగా కార్తీక పుణ్య స్నానాలను ఆచరించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించారు. పరమ శివుడిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలో బారులు తీరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

- సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్ల నుంచి రూ.50,340 అదనపు డబ్బులు స్వాధీనం



ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

ఆళ్లగడ్డ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై బుధవారం జిల్లా అవినీతి నిరోధక శాఖాధికారుల మెరుపు దాడులు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మికంగా కార్యాలయంలోకి వచ్చి ఎవరూ బయటకు పోకుండా తలుపులు మూసివేసి సోదాలు నిర్వహించారు. ఒక్క అధికారి వద్ద తప్ప మిగతా అధికారులు, సిబ్బంది వద్ద అదనంగా ఉన్న డబ్బులు స్వాధీనం చేస్తున్నారు. ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రాగానే ఆవరణలో ఉన్న డాక్యుమెంట్ రైటర్లు ల్యాప్‌టాప్, ప్రింటర్, ఇతర సామగ్రి, దస్త్రావేజులు పడేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆతర్వాత ఆ వస్తువులను తీసుకెళ్లినట్లు సమాచారం. ఏసీబీ అధికారులు కార్యాలయంలోని రిజిస్టర్, స్టాంప్ రికార్డులు, కంప్యూటర్లలో నమోదు అయిన రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ ఒక్క ఉద్యోగి వద్ద తప్ప అందరి వద్ద అదనపు మొత్తం డబ్బులు ఉన్నాయని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసర్ (ఎస్ఆర్వో) చైతన్య రాయల్ వద్ద నుంచి రూ.5,580, స్టాంప్ వెండర్ అనిల్ వద్ద రూ 8,060, సీనియర్ అసిస్టెంట్ చింతల పంషద్దీన్ వద్ద రూ.17,040, డాక్యుమెంట్ రైటర్లు చాంద్‌బాషా వద్ద రూ 2,180, విశ్వనాథ్‌రెడ్డి వద్ద రూ 17,480 ఉన్నట్లు వెల్లడించారు. వీరందరి నుంచి మొత్తం రూ. 50,340 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అదనపు డబ్బులపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిబంధనల ప్రకారం కార్యాలయంలో ఎవరి వద్ద అదనపు డబ్బులు ఉండకూడదన్నారు. అలాగే డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయంలోకి రాకూడదని, అయితే పలువురు డబ్బులతో కనిపించారని తెలిపారు. ఈమేరకు డబ్బులు లభించిన ప్రకారం కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



మెరుగైన వైద్య సేవలు అందించాలి

- న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల హాస్పిటల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశించారు. బుధవారం జీజీహెచ్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. మంత్రి ఫరూక్‌తో పాటు ఎంపీ డా.బైరెడ్డి శబరి, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఆస్పత్రిలోని మౌలిక సదుపాయాల లోపాలు, వైద్యసిబ్బంది కొరత, పారిశుధ్యం, మానవ వనరులు, పరికరాల అవసరం తదితర అంశాలపై చర్చించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ జీజీహెచ్‌ను ఆదర్శ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతా మన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణకు కొత్త ఏజెన్సీని కేటాయించామని, సెక్యూరిటీ బలోపేతానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా వచ్చిన నిధులను ఆస్పత్రి అభివృద్ధికి వినియోగిస్తున్నామన్నారు. ఆస్పత్రిలో అత్యవసర పరికరాల కోసం ఎంపీ ల్యాడ్స్ నిధులు వినియోగించుకోవాలని ఎంపీ బైరెడ్డి శబరి సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సురేఖ, డీసీహెచ్ఎస్ డా.ఓ.లలిత, సభ్యులు మాజీ కౌన్సిలర్ శివ శంకర్‌యాదవ్, కందుకూరి శ్రీరామమూర్తి, డా.బాబన్, టి.మద్దులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం కోటేకల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫరీద్ అహ్మద్‌ను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ సస్పెండ్ చేశారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఒకే ఫోన్ నెంబర్‌ను 928 అసెస్మెంట్‌లకు నమోదు చేశారు. ఈకారణంతో ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు పంచాయతీ అధికారి భాస్కర్ తెలిపారు.

ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు

- కలెక్టర్ రాజకుమారి
- దేశాభివృద్ధిలో ప్రధాన పాత్ర యువతదే: ఎంపీ శబరి

నంద్యాల నూనెపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): యువతలోని ప్రతిభను వెలికితీయడానికి యువజనోత్సవాలు ఒక సువర్ణ అవకాశమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. బుధవారం స్థానిక రామకృష్ణా పీజీ కళాశాల ఆడిటోరియంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని యువతలోని సృజనాత్మకతను, ప్రతిభను నాయకత్వ లక్షణాలను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం యువజనోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. వ్యాసరచన, ప్రసంగం, పెయింటింగ్, నృత్యం, జానపద కళలలో విద్యార్థులలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత తమకు నైపుణ్యం ఉన్న రంగాల్లో ప్రతిభను కనబరచాలన్నారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ దేశాభివృద్ధి లో యువత ప్రధాన పాత్ర పోషించాల్సి ఉందన్నారు. పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ ప్రగతి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- డీటీవో శివారెడ్డి



మాట్లాడుతున్న రవాణా శాఖ అధికారి

నంద్యాల టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాల బస్సులు నడిపేవారు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జిల్లా రవాణా శాఖాధికారి (డీటీవో) శివారెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా రవాణా కార్యాలయంలో పాఠశాల యజమానులతో, బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ.. రోడ్డుపై భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నైపుణ్యం కలిగినవారిని మాత్రమే డ్రైవర్లగా తీసుకోవాలన్నారు. డిప్యూటీ డీటీవో మాట్లాడుతూ పాఠశాలలు రవాణా శాఖ వారు చెప్పిన నిబంధనలు పాటించాలని, అలా చేయనివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులను సురక్షి తంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీవో శ్రీకాంత్, ఎంవీఐ సుబ్బయ్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీగిరిపై పౌర్ణమి వెలుగులు



ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవ వేడుక



లక్ష దీపోత్సవ కాంతులు

శ్రీశైలం నవంబర్ 05 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రంలో పరమశివునికి ప్రీతికరమైన కార్తీక పౌర్ణమి రోజు సాయంత్రం వేళ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ ఉత్సవంగా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన వేదికపై ఆసీనుల చేసి షోడశోపచార పూజా కార్యక్రమాలు జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లతోపాటు పుష్కరిణికి దశవిధ హారతులను ఇచ్చారు. పుష్కరిణి నాలుగువైపులా లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు.



కోటి దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా కోటి దీపోత్సవం

మహానంది, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి మహానందిలో వైభవంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాల్లో శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. ఆలయం మహాముఖ ద్వారం ముందు ఏర్పాటు చేసిన జ్వాలా తోరణానికి పూజలు చేశారు. వేలాదిమంది భక్తులు పాల్గొనగా కోటి దీపోత్సవంలో పాల్గొన్నారు.



యాగంటిలో పూజలు

బనగానపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎర్రమల కొండల్లో వెలసిన అత్యంత పురాతనమైన శైవక్షేత్రం యాగంటిలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష దీపోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు, మహిళలు ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి



కాల్వబుగ్గలో జి.కబర్ధికి స్వాగతం పలుకుతున్న కమిటీ మెంబర్లు

ఓర్వకల్లు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని కాల్వబుగ్గ, కొమ్ముచెరువు, కాల్వ, ఓర్వకల్లులోని జీవేశ్వరస్వామి పూడిచెర్ల, నన్నూరు. ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, కన్నమడకల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో దీపాలు వెలిగించి మహిళలు తమ మొక్కులను తీర్చుకున్నారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయానికి ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివునికి అభిషేకం చేసి ఉసిరి చెట్టుకు పూజలు చేసి కార్తీకదీపాలు వెలిగించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి, పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం గౌరవ సలహాదారాలు విజయభారతికి ఆలయ ఈవో మద్దిలేటి, ఆలయ చైర్మన్ కాటినేని నారాయణ తదితరులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. వారి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు.

దేదీప్యమానంగా కార్తీక పౌర్ణమి




కర్నూలులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు









కర్నూలు కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం నింగిలోని తారలన్నీ నేలపై వెలిగినట్లుగా.. దీపోత్సవ శోభ నేల నాలుగు చెరగులా పసిడి కాంతులు నింపింది. శ్రీశైలం, అహోబిలం, మహానంది, యాగంటి, మంత్రాలయం తదితర దివ్య క్షేత్రాలతోపాటు ఉమ్మడి జిల్లాలోని శైవ, వైష్ణవ ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు, జ్వాలా తోరణాలు, ఆకాశ దీపాలు వెలిగించి సంతోషంగా వేడుకల్లో పాల్గొన్నారు. కర్నూలు నగరంలోని వివిధ ఆలయాలు, ధార్మిక క్షేత్రాలు, కేసీ కెనాల్ ఒడ్డున శుక్రవారం సాయంత్రం నుంచి నిర్వహించిన కార్తీక దీపోత్సవం కన్నుల పండువ చేసింది. శైవ, వైష్ణవ ఆలయాల్లో కార్తీక దీపాలు, జ్వాలా తోరణాల మహోత్సవాలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని చెరువులు, నదుల్లో మహిళలు దీపాలు వదిలారు. కర్నూలులోని కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద లక్ష దీపోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వందలాదిగా మహిళలు తరలి వచ్చి, సామూహికంగా దీపాలను కేసీ కెనాల్‌లో వదలి పూజలు నిర్వహించుకున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కర్నూలు కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



హారతులు ఇస్తున్న వేద పండితులు



వైభవంగా తుంగా హారతి

- నదీతీరాన లక్ష దీపోత్సవం
- శ్రీమఠంలో ఘనంగా జ్వాలా తోరణం



తుంగా హారతి ఇస్తున్న పండితులు

మంత్రాలయం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య తుంగా హారతి రమణీయంగా సాగింది. బుధవారం రాత్రి కార్తీక పౌర్ణమి శుభసందర్భాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తుంగభద్ర నది ఒడ్డున వీఐపీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ప్రహ్లాదరాయలకు పూజలు చేసి హారతులు ఇచ్చారు. పీఠాధిపతి తుంగభద్రమ్మకు చీర, పసుపు, కుంకుమ ఇచ్చి పూజలు చేసి హారతులు ఇచ్చి కార్తీకదీపాలను వెలిగించారు. నది ఒడ్డున భక్తులు, దాససాహిత్య భజన మండలి సభ్యులు లక్ష దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, సుజీంద్రతీర్థఆచార్, ఆనందతీర్థ ఆచార్, మఠం ఏఏవో మాధవశెట్టి పాల్గొన్నారు. మంత్రాలయం సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్‌లతో సీఐలు మంజునాథ్, అబ్దుల్‌గౌస్ బందోబస్తు నిర్వహించారు.



తుంగభద్ర నదికి కార్తీక పూజలు చేస్తున్న పీఠాధిపతి

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం నగరంలోని సంకల్‌బాగ్‌లో గల హరిహర క్షేత్రంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ పాల్గొన్నారు.

మంత్రాలయంలో..

మంత్రాలయం: మంత్రాలయం రాఘ వేంద్ర స్వామి మఠంలో సామూహిక సత్యనారాయణ వ్రతం మఠం పీఠాధి పతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. బుధ వారం కార్తీక పౌర్ణమి సందర్భంగా యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సీఎం దృష్టికి కళాకారుల సమస్యలు

- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి
- కర్నూలు ఉత్సవ్-2025 సభలో హామీ

కర్నూలు కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నిరుపేద కళాకారుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుపోయి, పరిష్కారానికి కృషి చేస్తానని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, ఏపీ నాటక అకాడమీ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో కొనసాగుతున్న కర్నూలు ఉత్సవ్-2025 ఐదో రోజు బుధవారం కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, ఉమ్మడి జిల్లా రాజకీయ నేతల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆమె పరిశీలించారు. సభలో తెలుగు తల్లి, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. బుధవారం ఏకాంకిక నాటక పోటీలకు హాజరైన 16 మంది రంగస్థల కళాకారులను, ఐదుగురు హార్మోనిస్టు గురువులను ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పే విధంగా సాహిత్య, సాంస్కృతిక, కళారూపాలను వారం రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఉమ్మడి ముఖ్యమంత్రి అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, కళాకారులకు కూడా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలు ఉత్సవ్-2025 స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం సభ్యులు వెంకటేశ్వరావు, యాగంటీశ్వరప్ప, కేవీ రమణ, జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ రాయబారం నాటకంలో ఒక సన్నివేశం



ఎంపీ బైరెడ్డి శబరితో సత్కారం పొందిన కళాకారులు

కళాకారులను ఆదరించాలి

- అరుణభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి



కళాకారులను సత్కరిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కళాకారులను ఆదరించాలని అరుణభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి అన్నారు. యాగంటి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన పంచర త్నాల నాటక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కర్నూలు టీజీ వీ కళాక్షేత్రం, బనగానపల్లె అరుణభారతి సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పంచరత్నాల నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి సహకారంతో ఏర్పా టు చేసిన నాటక ప్రదర్శన ప్రేక్షకులను అలరించాయి. బీసీ రాజారెడ్డి, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డిలు సంయుక్తంగా నాటకంలో ప్రదర్శించిన కళాకా రులను ఘనంగా సత్కరించారు. రాత్రి 8 గంటల నుంచి నాటక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ప్రముఖ కళాకారు లచే గయోపాఖ్యానం పడక సీను, శ్రీకృష్ణ తులాభారం, అలకసీను, గయో పాఖ్యానం యుద్ధసీను, సత్యహరిశ్చంద్ర భవానీ సీను, కాటి సీను నాటక ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలిపారు. కళాకారులు శ్రీనివాసరెడ్డి, రమణ, చల్లా నవీన్‌కుమార్ చౌదరి, డాక్టర్ కదిరి రమేశ్, శ్రీమతి సుశీల, ఎం.వీ బాషా, హనుమంతుయాదవ్, గజల్ కళాకారుడు మహ్మద్‌మియాలు ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకున్నాయి. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ కళలకు కణచి అని, టీజీవీ కళక్షేత్రం కళాకారులకు అనేక నంది అవార్డులు వచ్చాయన్నారు. కళలను, కళాకారులను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని నాటకా లను తిలకించారు.

చెలమ వద్ద బీసీ రాజారెడ్డి పూజలు: యాగంటి సమీపంలోని మారునీళ్ల చెలిమ వద్ద అమ్మవారికి, శివునికి మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పూజలు చేశారు. ఈసందర్భంగా చెలిమ ప్రాముఖ్యతను ఆలయ నిర్వాహకులు ఆయనకు వివరించారు. అనంతరం బీసీ రాజారెడ్డి యాగంటి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వినోద వేదికగా వన భోజనాలు

- కలెక్టర్ సిరి



షటిల్ ఆడుతున్న కలెక్టర్ సిరి



క్యారం బోర్డు ఆడుతున్న అధికారులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక వన భోజనాలు వినోద వేదికగా అన్ని వర్గాల ప్రజలను ఆహ్లాదపరుస్తాయని కలెక్టర్ ఏ. సిరి అన్నారు. బుధవారం నగర శివారులోని విజయవనంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవన విధానంలో వన భోజనాలు అందరికీ ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచే వేదికగా అగుపిస్తున్నాయని అన్నారు.

అలరించిన ఆట పాటలు

కార్తీక వన సమారాధన సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో అతిథులు భాగస్వాములయ్యారు. కలెక్టర్ సిరి షటిల్, మ్యూజికల్ చైర్స్, క్యారమ్స్‌లో పాల్గొన్నారు. సంయుక్త కలెక్టర్ నూరల్ ఖమార్ షటిల్, కార్యమ్స్‌లో పోటీపడ్డారు. అనంతరం జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి అవినాష్ జయసింహ సినీ గీతాలను ఆలపించారు. ఆటల పోటీల్లో మహిళా ఉద్యోగులు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముగింపుగా అటవీశాఖ ఆధ్వర్యంలో అతిథులకు తులసి మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు కృష్ణమూర్తి, డీఎఫ్‌వో శ్యామల, డీఆర్వో వెంకట నారాయణమ్మ, గృహనిర్మాణశాఖ పీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.





మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్

గౌరవ వేతనాలు విడుదల చేయాలి



మంత్రి నారా లోకేష్‌తో పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సర్పంచులు, ఎంపీటీసీల, జడ్పీటీసీల గౌరవ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రుప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానిక సంస్థల బలోపేతం, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల సమస్యలు, నిధులు, విధులు, అధికారాల అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని వీరికి మంత్రి హామీ ఇచ్చారు. కొత్తపు మునిరెడ్డి, గోగినేని వసుధ, చుక్క ధనుంజయ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి యలవర్తి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తోడేస్తున్నారు..

తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటం ఇసుకాసురులకు కలిసి వచ్చింది. నీరు ఉండటంతో ప్రభుత్వం ఇసుక తరలింపును నిలిపేసింది. ఇదే వారికి కాసుల వర్షం కురిపిస్తోంది. నీటి ప్రవాహం తక్కువగా ఉన్న ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుకను ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. అధికారులకు ఇంతో అంతో ఆమ్యామ్యాలు ఇచ్చి సర్దుబాటు చేసుకున్నారు. దీంతో సంబంధిత శాఖల అధికారులు ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా పట్టించుకోవడం లేదు.

- తుంగభద్ర నదిలో జోరుగా ఇసుక అక్రమ రవాణా
- అనుమతుల్లేకుండా దోచేస్తున్న అక్రమార్కులు
- కన్నెత్తి చూడని మైనింగ్, రెవెన్యూ అధికారులు
- పని చేయని సీసీ కెమెరాలు



తుంగభద్రనదిలో అనుమతులు లేని ఇసుక ట్రాక్టర్లు

కౌతాళం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో ఇసుకను అక్రమార్కులు తోడేస్తున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు ఇసుకాసురులు. మండలంలో నదిచాగి, గుడికంబాలి, మరళి గ్రామాల్లోని ఇసుక రీచ్‌లకు ప్రభుత్వ అనుమతులున్నా ప్రస్తుతం నదిలో నీరు ఉండటంతో ఇసుక రీచ్‌ల నుంచి తాత్కాలికంగా ఇసుక తరలింపును నిలిపి వేశారు.

రోడ్లు గుంతలమయంగా మారి..

ట్రాక్టర్ల ద్వారా ఇసుకను నిత్యం తరలిస్తుండటంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సి మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టినా అది నిజమైన లబ్దిదారులకు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కనిపించని సీసీ కెమెరాలు



నీరు తక్కువ ఉన్న ప్రదేశంలో..

నదిచాగి రీచ్ వద్ద నదిలో నీరు తక్కువ ఉన్న ప్రదేశంలోకి నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్‌ల ద్వార ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్‌కు రూ.800నుంచి రూ.1000 ప్రకారం వసూలు చేస్తూ అక్రమాలకు తెరలేపారు. ఇక్కడ నుంచి మండలంలోని ఇతర గ్రామాలతో పాటు కోసిగి, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాలకు ట్రాక్టర్ల ద్వార రవాణా చేస్తున్నారు. నదిచాగి వద్ద ఉన్న తుంగభద్ర నది నుంచి కాత్రికి, పొదలకుంట, సుళేకేరి మీదుగా కౌతాళం ఆదోని మండలాలకు, నదిచాగి హల్వి మీదుగా కోసిగి, ఎమ్మిగనూరుకు నిత్యం వందల సంఖ్యలో ఇసుకను తరలిస్తున్నారు.

దూరం పెరిగే కొద్ది..

ట్రాక్టర్ ఇసుక కావాలంటే 20-30కిలోమీటర్ల దూరానికి రూ.3వేల నుంచి రూ.5వేలు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుంది. దూరం పెరిగేకొద్ది ఇసుక మరో రేటు ఉంటుంది. ఇప్పటికైనా మైనింగ్ అధికారులు నదితీర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఇసుక అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేసులు నమోదు చేస్తాం

ఇసుక తరలింపుపై తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డిని వివరణ కోరగా ప్రస్తుతం నదిలో నీరు ఉండటంతో ఇసుక తరలింపును నిలిపివేశామన్నారు. ఎవరైన అనుమతులు లేకుండా నది నుంచి ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

క్రిష్ణగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తనను చూసుకునేందుకు ఎవరూ లేరు అన్న దిగాలుతో ఓ వృద్ధుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని తొగర్చేడు గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ బజారి(66)కి ముగ్గురు కొడుకులు. వీరంతా ఓ హత్యకేసులో నిందితులు. కాగా రెండో కుమారు బోయ రామాంజినేయులు ఆరేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. మొదటి, మూడో కుమారుడు బాలకేశన్న, రామానాయుడు కడప సెంట్రల్ జైల్‌లో జీవిత ఖైదీ శిక్షను అనుభవిస్తున్నారు. బజారిని చూసుకోవడానికి కొడుకులు ఎవరూ లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వెంకట లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

క్రిష్ణగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న రైతు చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని ఎరుకలచెరువుకి చెందిన రైతు కురువ వెంకట్రాముడు (46) అప్పుల బాద తాళలేక సోమవారం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు క్రిష్ణగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొంది ఇంటికెళ్లాడు. కాగా క్షీణించడంతో కోడుమూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక మృతిచెందాడు. మృతుడి కుమారుడు వీరాంజనేయులు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీజీహెచ్‌లో దొంగల హల్‌చల్

- గైనిక్ విభాగంలో వైద్యుల సొమ్ము చోరీ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్)లో దొంగలు హల్‌చల్ చేశారు. పభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వైద్యులకు భద్రత కరువైంది. ఆసుపత్రిలో ప్రతి రోజు దొంగతనాలు సర్వసాధారణంగా మారాయి. మంగళవారం గైనిక్ విభాగంలోని డీఆర్ రూంలో కాన్పు కోసం వెళ్లిన ఓ వైద్యురాలి బ్యాగ్‌లో నుంచి రూ.1,500 దొంగలు ఎత్తుకెళ్లడం కలకలం రేపింది. మూడు రోజుల క్రితం ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు చెందిన రూ.2,500, నాలుగు రోజుల క్రితం ఓ డాక్టర్ అవసరాల కోసం బ్యాగ్‌లో పెట్టుకున్న రూ.5వేలు చోరీకి గురయ్యాయి. ఇలా డాక్టర్ల సొమ్ము చోరీకి గురి కావడంతో వైద్యులు ఆందోళన చెందుతున్నారు. అలాగే గైనిక్, చిన్న పిల్లల విభాగంలో పర్యవేక్షణ లేకపోవడం, రోగులు, వారి బందువుల నుంచి సెల్‌ఫోన్లు, ఖర్చుల కోసం తెచ్చుకున్న డబ్బులను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. ఆసుపత్రిలో కొత్తగా రోగుల భద్రత కోసం ఈగల్ హంటల్ ఏజెన్సీకి ప్రభుత్వం కేటాయించి ఆసుపత్రిలో 238 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉండాల్సి ఉండగా.. కేవలం 148మంది మాత్రమే పని చేస్తుండటంతో సిబ్బంది లేక దొంగతనాలు తరుచూ జరుగుతున్నాయి. మూడు నెలలుగా సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలని హాస్పిటల్ అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఏజెన్సీ వాటిని పక్కన పెడుతున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా స్పందించి సెక్యూరిటీ సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి రోగులకు, వైద్యులకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గడివేముల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిమద్దెలలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, వీఆర్వో ఫనిద్ర దాడులు నిర్వహించి పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ప్రసాద్‌రావు మరో ఇంటిని బాడగకు తీసుకొని అక్రమంగా 30 బస్తాల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు తెలిపారు. పక్కా సమాచారంతో దాడులు చేసి రేషన్ బియ్యం పట్టుకొని అతడిపై కేసు నమోదు చేశామన్నారు.



రేషన్ బియ్యంతో రెవెన్యూ సిబ్బంది

మహానందిలో ప్రముఖుల పూజలు



మహానందిలో పూజలు నిర్వహించడానికి వస్తున్న ప్రభుత్వ సలహాదారు అజయ్‌కుమార్ జైన్

మహానంది, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహానందిలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి, ప్రభుత్వ సలహాదారుడు అజయ్‌కుమార్ జైన్ కుటుంబ సమేతంగా పూజలు చేశారు. నంద్యాల ఏఎస్పీ మందాజావళి తో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఏఎస్పీ ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డిని ఆదేశించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- చికిత్స కోసం కర్నూలుకు తరలింపు

జూపాడుబంగ్లా/నందికొట్కూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎలుకల మందు తాగి ఓ హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన జూపాడుబంగ్లా మండల కేంద్రంలో ఏపీ మోడల్ స్కూల్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, తోటి విద్యార్థినులు తెలిపిన మేరకు వివరాలు.. మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండియర్ (కామర్స్) చదువుతోంది ఓ విద్యార్థిని. మంగళవారం సాయంత్రం కళాశాల ముగిసిన అనంతరం ఆ విద్యార్థిని హాస్టల్‌కు రాలేదు. తన స్నేహితురాలి పుట్టినరోజు వేడుకలను జరుపుకునేందుకు మరో స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. హాస్టల్ వార్డెన్ కళ్యాణి సాయంత్రం 6గంటల సమయంలో స్టడీ అవర్స్‌లో అటెండెన్స్ తీసుకుంటుండగా విద్యార్థిని గైర్హాజరు కావడంతో ఆమె అమ్మాయి ఇంటికి ఫోన్‌చేసి సమాచారమిచ్చింది. స్టడీ హాల్‌లో ఉన్న ఇతర విద్యార్థినులను ప్రశ్నించగా డేస్కాలర్ విద్యార్థిని జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిందని వారు తెలిపారు. సదురు విద్యార్థినికి ఫోన్‌చేసి హాస్టల్‌కు రాకుండా అనుమతి లేకుండా ఎలా వెళ్తావు అంటూ వార్డెన్ మందలించింది. హాస్టల్‌లో జరిగిన సంఘటనను ప్రిన్సిపాల్ రమేష్ దృష్టికి ఆమె తీసుకెళ్లింది. బుధవారం ఉదయం విద్యార్థిని తోటి విద్యార్థినులతో కలిసి స్కూల్‌కు వచ్చింది. అనుమతులు లేకుండా బయటికి ఎలా వెళ్తావు.. టీసీ తీసుకొని వెళ్లిపోమని ప్రిన్సిపాల్ సైతం మందలించారు. అంతలోనే విద్యార్థిని తల్లి కూడా వచ్చి కూతురిపై ఆగ్రహం వ్యక్తంచేసింది. దీంతో భయపడ్డ ఆవిద్యార్థిని ఏమి చేయాలో తెలియక వాష్‌రూంకు వెళ్లి ఎలుకల మందు తాగి అపస్మారక స్థితిలో వెళ్లింది. ఇది గమనించిన విద్యార్థినులు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జూపాడుబంగ్లాలో పీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి నందికొట్కూరు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. విద్యార్థిని కాలేజీకి వచ్చే ముందే కిరాణ దుకాణంలో ఎలుకల మందు కొనుగోలు చేసింది తోటి విద్యార్థినులు చెబుతున్నారు. అసలు ఈ ఘటనలో అందరి నిర్లక్ష్యం కనిపిస్తోంది. విద్యార్థిని అనుమతి లేకుండా బయటికెళ్లి రాత్రికి కూడా రాకపోవడం. కనీసం వార్డెన్ అయినా స్పందించి ఆ అమ్మాయిని తీసుకురాకపోవడం.. ప్రిన్సిపాల్, వార్డెన్, తల్లి అందరూ కలిసి మందలించడంతో విద్యార్థిని భయపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది.

ఎన్టీఆర్ వైద్యసేవ కేసులు పెంచండి

- బోధనాసుపత్రి సమస్యలను పరిష్కరిస్తాం : కలెక్టర్
- కర్నూలు మెడికల్ కాలేజీ వైద్యులతో సమీక్ష



మెడికల్ కాలేజీలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ కింద కేసులన్నింటిని ప్రీ అథరైజ్ చేయాలని కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు. బుధవారం సాయంత్రం కర్నూలు మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాల్లో జీజీహెచ్, మెడికల్ కాలేజీ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీ కింద 250 మంది రోగులుంటే 150 మంది రోగుల వివరాలు మాత్రమే డాక్యుమెంటేష్ చేస్తున్నారపి, 75 మంది సిబ్బందితో కేసుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. ఇందుకు స్పందించిన హాస్పిటల్ సూపరింటెండెంట్ తెలంగాణ కేసులు ఉంటాయనీ, అవి పరిగణలోకి రావని వివరించారు. రాష్ట్రంలోనే అత్యధిక ఆపరేషన్లు నిర్వహిస్తున్న జనరల్ సర్జరీ విభాగాన్ని కలెక్టర్ అభినందించారు. ఎన్టీఆర్ వైద్యసేవ కింద అవసరమైతే బయట నుంచి మత్తుమందు వైద్యులను రప్పించుకునే అవకాశాన్ని కలెక్టర్ కల్పించారు. అత్యవసర సర్జరీ కేసులకు రేడియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ రాత్రి సమయంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కొందరు వైద్యులు కలెక్టర్‌కు విన్నవించారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ 24 గంటలు ఒక రేడియాలజిస్టు డ్యూటీలో ఉండాలని ఆదేశించారు. అనస్తీషియా విభాగాన్ని ఇతర విభాగాల మాదిరిగా ఆరు యూనిట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కాన్సర్ ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్లను ఇంకా పూర్తి చేయకపోవడంపై కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సత్యనారాయణ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్, డా.హరి చరణ్ హెచ్‌వోడీలు, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు పాల్గొన్నారు

మోటారు వాహనాల దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్హత కలిగిన దివ్యాంగులు, మూడు చక్రాల మోటార్ వాహనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దివ్యాంగులు, వృద్ధుల సహాయ సంస్థ మేనేజర్ రయిస్ ఫాతిమా తెలిపారు. వివరాల కోసం 08518-277864ను సంప్రదించాలన్నారు.

అర్హత ప్రమాణాలు

- 25-11-2025 నాటికి 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు
- ఒకటి లేదా రెండు కింద భాగాలు (లోయర్ లింబ్స్) ప్రభావితమై 70 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉండాలి
- వార్షిక కుటుంబ ఆదాయం రూ.3లక్షల కంటే ఎక్కువ ఉండకూడదు
- అభ్యర్థి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారై ఉండాలి
- వాహనం నడపడానికి చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి
- ప్రభుత్వం లేదా ప్రైవేటు సంస్థల ద్వారా ఇంతకు ముందు ఏ వాహనాన్ని పొంది ఉండకూడదు

దరఖాస్తుతోపాటు జత చేయాల్సిన ధృవీకరణ పత్రాలు

- వికలాంగుల ధృవపత్రం (సదరం/ జిల్లా వైద్య బోర్డు), ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, కుల ధృవపత్రం, తాజా ఆదాయ ధృవపత్రం, పాస్ ఫోర్ట్ సైజు ఫొటో, ఇంతకు ముందు వాహనం పొందలేదని స్వీయ ప్రకటన.

అణగారిన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

- తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సంజామల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని పేరుసోమల విష్ణుకంటి క్షేత్రంలో వెలిసిన కంబగిరి స్వామి ఆలయంలో స్పీకర్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు రామ్మోహన్‌స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న పవిత్రోత్సవాలకు స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా తహసీల్దార్ అనిల్‌కుమార్, కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్, ఎస్ఐలు రమణయ్య, మల్లికార్జున రెడ్డి, ఆలయ నిర్వాహకులు ఆయన కు ఘనస్వాగతం పలికారు. కంబగిరిస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కంబగిరిస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు మర్యాదపూర్వకంగా స్పీకర్‌ను కలిశారు. రెండు రాష్ట్రాల్లో బీసీల అభివృద్ధిపై చర్చించారు.



పూజలో పాల్గొన్న స్పీకర్

రెవెన్యూ డివిజన్‌గా బనగానపల్లె

- ప్రభుత్వానికి ప్రతిపాదన

నంద్యాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల పునర్విభజన నేపథ్యంలో బుధవారం అమరావతిలో జరిగిన సదరు కమిటీ మంత్రుల సమావేశంలో జిల్లాలోని బనగానపల్లెను రెవన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ప్రతిపాదన తెరపైకి వచ్చింది. మంత్రులు అనగాని సత్య ప్రసాద్, నాదెండ్ల మనోహర్ అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు సమక్షంలో ఈ అంశంపై సమగ్రంగా చర్చించినట్లు తెలుస్తోంది. సీఎం చంద్రబాబు సూచనలు... మార్గ దర్శకాల మేరకు పలు అంశాల పరంగా క్షుణ్ణంగా పరిశీలించారని తెలిసింది. ఏదేమైనా జిల్లాలో బనగానపల్లెను రెవెన్యూ డివిన్‌గా ఏర్పాటు చేస్తే ఐదు మండలాలకు ఊరట కల్పించే విషయం.

గతంలో నంద్యాలలో..

ఉమ్మడి కర్నూలు జిల్లాగా ఉన్నప్పుడు బనగానపల్లె నియోజక వర్గం నంద్యాల రెవెన్యూ డివిజన్‌లో ఉండేది. కర్నూలు, నంద్యాల జిల్లాల మార్పు నేపథ్యంలో డోన్ రెవెన్యూ డివిజన్‌లోకి బనగానపల్లెను చేర్చారు. అయితే తాజాగా జిల్లాల పునర్విభజన నేపథ్యంలో డోన్‌ను కర్నూలు జిల్లాలోకి కలపాలనే ప్రతి పాదన కూడా తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే తాజాగా బనగా నపల్లె రెవెన్యూ డివిజన్ చేయాలని తెరపైకి వచ్చినట్లు సమా చారం. ఏది ఏమైనా బనగానపల్లె ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తే.. సదరు రెవెన్యూ డివిజన్‌లోని బనగానపల్లె మండల ంతో పాటు కోయిలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మండలాలకు చెందిన ప్రజలకు ఊరట కలిగించే విషయం.

త్వరలో ప్రభుత్వం దృష్టికి..

జిల్లాల పునర్విభజనతో పాటు రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటుపై కూడా సదరు కమిటీ లోతుగా పరిశీలించినట్లు తెలుస్తోంది. జిల్లాల నుంచి వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త జిల్లాలతో పాటు రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటుపై తుది జాబితాను త్వరలో సీఎం చంద్రబాబుకు అందజేయ నున్నారు. బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయం తెరపైకి రావడంతో చర్చనీయాంశంగా మారింది. డోన్ రెవెన్యూ డివిజన్ పరిస్థితి ఏంటి..? ఒకవేళ డోన్‌ను కర్నూలులో కలుపుతారా..? అనే సందేహాలు లేకపోలేదు.


కుల, చేతి వృత్తిదారుల ఉపాధే లక్ష్యం

కర్నూలు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుల, చేతి వృత్తిదారుల ఉపాధే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు. బుధవారం విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అధ్యక్షతన సమీక్ష జరిగింది. ఆదరణ 3.0 పథకం అమలుపై నాయి బ్రాహ్మణులకు ఆధునిక సంగీత పరికరాల పనిముట్లు ఇవ్వడంపై చర్చించారు. కిలార్నట్, డోలు, రండోలు, తాషా, సాక్సోఫోన్ వంటి ఆధునిక సంగీత పరికరాలు, అత్యాధునిక రాజహంస చైర్లు మంజూరు చేయాలని కోరారు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం..

- మల్లేశ్వరస్వామి ఆలయం
- కార్తీకమాసంలో ప్రత్యేకపూజలు

రుద్రవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉల్లెండకొండ మల్లేశ్వరస్వామి ఆలయం. కార్తీకమాసంలో ఇక్కడి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. ఉల్లెడకొండ వద్ద అశ్వతామ మహార్షి తపస్సు చేసిన గుహలు ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడ్డాయి. ఈ గుహలను అశ్వత్థామ గుహలుగా పిలువబడతాయని భక్తులు చెబుతున్నారు. ఇక్కడ ప్రకృతిగా ఏర్పడిన పెళ్లిపందిరి ఉంది. గలగలపారే సెలయేర్లు ఒక వైపు, ఎత్తయిన కొండలు, కొండకు ప్రకృతి దేవతాశిల్పాలు ఏర్పడ్డాయి. ఆళ్లగడ్డ- అహోబిలం నుంచి నాగంబాయి వద్ద నుంచి దారి ఉంది. ఈ దారి ఉల్లెడకొండకు చేరుకోవడానికి నల్లమల అడవిలో 18కిలోమీటర్లు ప్రయాణించాలి. ఉల్లెడ కొండ కొండపై ప్రకృతి శిల్పకళ ఉంది. గుహలో స్వయంభువుడుగా నాగశేషుడు, శివలింగం ఏర్పడ్డాయి. కర్నూలు - నంద్యాల, ప్రకాశం కడప జిల్లాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. స్వామి దర్శనంతో పాటు ప్రకృతి అందాలు, ఎత్తయిన కొండలు ప్రకృతి శిల్పసంపదను భక్తులకు కనువిందు చేస్తుంటాయి. నల్లమలలో దేవతలు పెళ్లిళ్ల చేసుకున్న ప్రకృతి పందిరి ఉంది. కొండల మధ్య సెలయేరు ప్రవహిస్తుంది. కొండ ప్రకృతి పందిరిలా దర్శనమిస్తుంది.



నల్లమలలో ఉల్లెడ కొండ

మొక్కజొన్న ధర పతనం



యార్డులో రైతులు అమ్మకానికి తెచ్చిన మొక్కజొన్న

- కన్నీరు మున్నీరవుతున్నరైతులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు అమ్మకానికి తెచ్చిన మొక్కజొన్న ధరలు భారీగా పతనమయ్యాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటానికి రూ.2,400 కాగా, బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటా మొక్కజొన్నల ధర గరిష్ఠంగా రూ.1,749లు, మధ్యస్థ ధర రూ.1709లు, కనిష్ఠంగా రూ.1,409ధర మాత్రమే పలకడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. రెండు నెలల నుంచి తాము ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నా మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు కేంద్రాల కోసం చర్యలు తీసుకోకపోవడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికందిన పంటనైనా దక్కించుకుందామని రైతులు ఆశిస్తే కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటానికి రూ.700 వ్యత్యాసంతో ధర పతనం కావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏం తమాషా చేస్తున్నారా..!

● ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ మారూఫ్ ఆసియా ఆగ్రహం

ఆత్మకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏం తమాషా చేస్తున్నారా..! కౌన్సిల్ కు కనీస సమాచారం ఇవ్వకుండానే సమావేశాలను ఏవిధంగా నిర్వహిస్తారంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా సమావేశంలో తీర్మానాలను ప్రవేశ పెట్టే ప్రయత్నం చేయగానే కొందరు కౌన్సిలర్లు సాధారణ, అత్య వసర సమావేశాలకు తేడా ఏంటని అధికారును ప్రశ్నించారు. అత్య వసర సమావేశం ఉన్నట్లు యితే కనీసం 24గంటల ముందు కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వాలని రాత్రి రాత్రికి సమాచారం ఇస్తే ఏవిధంగా కౌన్సిల్ సభకు హాజరు కావాలని నిలదీశారు. గత నెల 10న చైర్‌పర్సన్‌కు కనీస సమావేశం ఇవ్వ కుండా కౌన్సిల్ సమావేశాన్ని వైస్ చైర్‌పర్సన్ సమక్షంలో ఎలా నిర్వ హిస్తారని చైర్మన్ మారూఫ్ ఆసియా మండి పడ్డారు. ఇలాంటి పొరపాటు మళ్లీ జరిగితే న్యాయపరమైన కేసులు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ రామ కృష్ణ ఇలాంటి తప్పిదం మళ్లీ జరగదంటూ సమావేశంలో సభ్యులందరికీ క్షమాపణలు చెప్పారు. కౌన్సిల్ సభలో ఐదు తీర్మానాలు ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, వైస్‌చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

వసతుల కల్పనలో రాజీపడొద్దు

శ్రీశైలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రానికి వచ్చే యాత్రికులకు వసతులు కల్పించుటలో రాజీపడవద్దని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రమేష్‌నాయుడు ఆదేశించారు. బుధవారం క్యూలైన్లు, కంపార్ట్ మెంట్లలో వేచిఉన్న భక్తులతో మాట్లాడారు. అల్పాహారాలు అందిస్తున్న శివసేవకులకు సూచనలిచ్చారు. అనంతరం భోజనశాలలో పలువురి అభిప్రాయలను పరిగణనలోకి తీసుకున్నట్లు ఆయన తెలి పారు. చైర్మన్ వెంట శివాజీ స్ఫూర్తికేంద్రం నిర్వాహకుడు వంశీకృష్ణ, వెంకటేశ్వర్లు, రామోజీ తదితరులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

ఆత్మకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగేంద్రుడు బుధవారం తెలి పారు. ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

ఆలయాల్లో శివనామ స్మరణ


నంద్యాల ప్రథమ నందీశ్వరాలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు


నందికొట్కూరు: ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పల్లకీ సేవలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్


ఆత్మకూరులోని ఉమామహేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

● భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు
● దీపాలు వెలిగించిన మహిళలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గాల వ్యాప్తంగా ఆయా మండలాల్లోని గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం లక్షదీపోత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు, మహిళలు స్వామిని దర్శించుకున్నారు. శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఆకాశదీపాలు, కార్తీక దీపాలు, జ్వాలాతోరణం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


పాములపాడు శివాలయం ఆవరణలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు


కొత్తపల్లె: సంగమేశ్వరంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


నందికొట్కూరు: ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద జ్వాల తోరణ మహోత్సవం


బండిఆత్మకూరు: ఓంకారంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


గడివేముల: స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు


జూపాడుబంగ్లాలో సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

'వన్ స్టాప్'తో మహిళలకు రక్షణ

● న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
● జీజీహెచ్‌లో వన్ స్టాప్ సెంటర్‌కు శంకుస్థాపన

నంద్యాల హాస్పిటల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వన్‌స్టాప్ సెంటర్‌తో మహిళలకు రక్షణ ఉంటుందని న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో రూ.60లక్షలతో నిర్మించనున్న వన్‌స్టాప్ భవనానికి కలెక్టర్ రాజకుమారి, ఎంపీ డా.బైరెడ్డి శబరితో కలిసి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం వన్ స్టాప్ సెంటర్ పథకం కింద దేశవ్యాప్తంగా మహిళల రక్షణ, సహాయం, పునరావాసం కోసం సెంటర్లను ఏర్పాటు చేస్తోందని ఆ జాబితాలో నంద్యాల జిల్లా ఉండటం గర్వకారణమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వన్ స్టాప్ సెంటర్ నిర్మాణ బాధ్యతను ఏపీఎంఎస్ఐడీసీ ఏజెన్సీకి అప్పగించామన్నారు. ఈ సెంటర్ ద్వారా బాధిత మహిళలు, బాలికలకు ఆరోగ్యసేవలు, న్యాయసలహాలు, చట్టపరమైన సహాయం, మానసిక కౌన్సెలింగ్, తాత్కాలిక వసతి వంటి 5రకాల సమగ్ర సేవలను ఒకే చోట అందించనున్నట్లు తెలిపారు. బాధిత మహిళల తరలింపు, అత్యవసర సేవల నిమిత్తం ఉపయోగించే వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ అధికారి లీలావతి, మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కందుకూరి శ్రీరామమూర్తి, జిల్లా అధికారులు, మహిళా సంక్షేమ విభాగం అధికారులు పాల్గొన్నారు.


వన్‌స్టాప్ సెంటర్‌కు పూజ చేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం కార్యవర్గం ఎన్నిక

నంద్యాల హాస్పిటల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్ల పదవీకాలానికి 38మందితో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని సీనియర్ మహిళా వైద్యురాళ్లు నాగమణి, నర్మద, వసుధ, లక్ష్మీసౌజన్య పర్య వేక్షణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం నూతన అధ్యక్షురాలిగా మధు చిన్న పిల్లల ఆస్పత్రి నిర్వాహకురాలు, సీనియర్ అనస్థీషియా వైద్యనిపుణురాలు మాధవి, కార్యదర్శులుగా డాక్టర్ పెనల సునీత, డాక్టర్ శైలజలను ఎన్నుకున్నారు. కోశాధికారిగా డాక్టర్ హరిత, ఉపాధ్యక్షురాలుగా డాక్టర్ నాగరేఖ, డాక్టర్ ధనలక్ష్మి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.


డాక్టర్ మాధవి


డాక్టర్ సునీత


డాక్టర్ శైలజ

శ్రీశైలంలో ఎమ్మెల్యే దంపతులు పూజలు


కార్తీక దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా దంపతులు

శ్రీశైలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, శైలజ దంపతులు శ్రీశైల క్షేత్రాన్ని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి దీపాలు వెలిగించారు. అలాగే జ్వాలా తోరణోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌నాయుడు, పాలకమండలి సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అలాగే భక్తిశ్రద్ధలతో లక్షకుంకుమార్చన చేశారు. స్వామి, అమ్మవారి పల్లకీసేవ నిర్వహించారు. అమ్మవారికి ఖడ్గ మాల, త్రిశతి, లలితా పారాయణాలు పఠించినట్లు వేదపండితులు చెప్పారు. ఊయలసేవ నిర్వహించారు.

భద్రత కట్టుదిట్టంగా ఉండాలి: ఏఎస్పీ

బండిఆత్మకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో ప్రత్యేక దినాల్లో భద్రత చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని ఏఎస్పీ జావళి ఆలయ అధికారులకు, పోలీసు సిబ్బందికి సూచించారు. బుధవారం ఓంకారం దేవస్థానంలో కోనేరు, క్యూలైన్లు, టిక్కెట్ కౌంటర్లు, భోజనశాలలను ఏఎస్పీ పరిశీలించారు. ఏఎస్పీ గంగా, ఉమా సమేత సిద్ధేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. వెంట వెంట సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ జగన్మోహన్, ఏఎస్ఐ భాష ఉన్నారు.

అయ్యప్ప స్వాముల నిరసన

నందికొట్కూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్ వద్ద బుధవారం అయ్యప్ప స్వాములు నిరసన చేపట్టారు. 5వ తరగతి చదువుతున్న చందు అనే విద్యార్థి అయ్యప్ప మాల ధరించారు. మంగళవారం మధ్యాహ్నం భిక్ష కోసం బయటకు వెళ్తుండగా... తమ అనుమతి లేకుండా ఎలా దీక్ష తీసుకుంటారని స్కూల్ హెడ్‌మాస్టర్ నిర్మల తనను కొట్టారంటూ చందు అయ్యప్పస్వాములకు తెలిపారు. దీంతో అయ్యప్ప స్వాములు బుధవారం ఉదయం సెయింట్ మేరీస్ స్కూల్ వద్ద నిరసన చేపట్టారు. చివరకు హెడ్‌మాస్టర్ అయ్యప్ప భక్తులకు జరిగిన ఘటనపై వివరణ ఇస్తూ... రోజూ క్యారియర్ తెచ్చుకునే విద్యార్థి మధ్యాహ్న భోజనానికి బయటకు వెళ్తానంటే.. మీ నాన్న వస్తే పంపుతామని చెప్పానే తప్ప.. మాలధారులను అవమానించడం తన ఉద్దేశం కాదని అన్నారు. తమ పాఠశాలలో ఇంకా అయ్యప్ప మాల ధరించిన విద్యార్థులు ఉన్నారని, వారి తల్లి దండ్రులు వచ్చి భిక్షకు తీసుకెళ్తారన్నారు. ఉపాధ్యాయులు కూడా మాల ధరిస్తారన్నారు. తమ పాఠశాలలో ఎలాంటి వివక్ష ఉండదని, అన్ని మతాలను గౌరవిస్తామని ఆమె తెలిపారు.

కాలనీని చుట్టుముట్టిన వర్షపు నీరు

పాణ్యం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనవరం ఎస్సీ కాలనీలోకి వర్షపు నీరు అధికంగా చేరడవతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి కాలనీలో నీరు చేరి జనజీవనానికి ఆటంకమేర్పడింది. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు దేవదానం సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వం డ్రైనేజీలు లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టడంతో ఈపరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆరోపించారు.

7న ఖోఖో, సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి ఖోఖో, సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు ఈ నెల 7న నంద్యాలలోని కేఎస్ఎం ఉన్నత పాఠశాల, రామకృష్ణ పీజీకళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు బి.విశ్వనాథ్, జి.ఆశాజ్యోతి తెలిపారు. డివిజన్ స్థాయిలో ఎంపికైన అండర్-14, 17ఖోఖో బాల, బాలికలు కేఎస్ఎం పాఠశాలలో హాజరు కావాలన్నారు. జిల్లా స్థాయి డైరెక్ట్ సెలెక్షన్స్ కోసం సాఫ్ట్‌బాల్ అండర్-14, 17బాల, బాలికలు రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో హాజరుకావాలని వారు కోరారు. క్రీడాకారులు అర్హత పత్రాలు, మిడ్‌డే మీల్స్ పత్రాలు వెంటతీసుకొని రావాలన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

భద్రత ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర

ఆళ్లగడ్డ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల యజమానులు బస్సుల భద్రత ప్రమాణాలను తప్పక పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర అన్నారు. బుధవారం స్థానిక ప్రజ్ఞా డిగ్రీ కళాశాలలో ఆళ్లగడ్డ తాలుకాలోని స్కూల్ బస్సుల యజమానులతో భద్రత ప్రమాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనానికి అత్యవసర ద్వారం, 60 కి.మీలకు మించకుండా స్పీడ్ లాక్, ఫైర్ డిటెక్షన్, అలారం, అగ్నిమాపక పరికరాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అపుస్మా అధ్యక్షుడు అమీర్‌బాషా, కరస్పాండెంట్ శ్రీనాథ్ రెడ్డి, శివ, రాజా పాల్గొన్నారు.

గంగ కాలువకు గండ్లు



అప్పనపల్లె సమీపంలో కాలువకు పడిన గండి

రుద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ బ్లాక్ చానెళ్లకు గండ్లు పడ్డాయని బుధవారం రైతులు తెలిపారు. అప్పనపల్లె సమీపంలో 19వ బ్లాక్ చానెల్‌కు యూటీ వద్దగండి పడింది. రుద్రవరం సమీపంలో 20వ బ్లాక్ చానెల్ కల్వర్టు వద్ద గట్టు కుంగిపోయింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

చాగలమర్రి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఎంఈవో న్యామతుల్ల ఏజెన్సీ మహిళలకు సూచించారు. బుధవారం మండలంలోని చిన్నబోదనం, పెద్దబోదనం, తిప్పనపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అసైన్‌మెంట్ పుస్తకాలను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీ లించారు. తిప్పనపల్లె పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేసిన పాఠశాల చైర్మన్‌ను అభినందించారు. హెచ్‌ఎంలు యేసుదాసు, రాజేష్, కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయండి

రుద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో సర్వేను వేగవంతం చేయాలని ఈవోపీఆర్డీ శివ ప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గోవిందస్వామి ఆరాధనోత్సవాలు

కొలిమిగుండ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనాయినిపేట గ్రామంలో వెర్రి గోవిందస్వామి 268వ ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి, కొలిమిగుండ్ల సొసైటీ చైర్మన్ అంబటి వివేకానందరెడ్డి, టీడీపీ నాయకుడు అంబటి జయలక్ష్మీరెడ్డిలు పాల్గొని పూజలు నిర్వహిం చారు. ఆలయ కమిటీ సభ్యులు నాయకులను సన్మానించారు. రెండు తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు కర్ణాటకకు చెందిన పలువురు భక్తులు తరలివచ్చి స్వామి వారి పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకీలో గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

కన్నుల పండువగా కల్యాణం

డోన్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పాతబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ధర్మకర్త బైసానిరాజు దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేవనూరు పీహెచ్‌సీ వైద్యుడు సుభాన్ అన్నారు. బుధవారం రేవనూరు పీహెచ్‌సీలో రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ సుభాన్ మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, నీరు నిల్వ ఉన్న చోట వేస్టు ఆయిల్ చల్లి శుభ్రం చేసుకోవాలన్నారు.

విద్యార్థులు సత్తా చాటాలి

రుద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్కిల్ పోటీల్లో సత్తా చాటాలని ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం విద్యార్థులకు స్కిల్ విభాగంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అగ్రికల్చర్ ట్రైనర్ జ్యోతిప్రియ, ఐటీ ట్రైనర్ హరి ఆధ్వర్యంలో నిరష్టహించారు. విద్యార్థులు వ్యవసాయం, ఐటీ, హస్తకళలు ప్రాజెక్టు నమూనా విభాగాల్లో నైపుణ్యం ప్రదర్శించారు. సేంద్రియ వ్యవసాయం, నీటి సంరక్షణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల ఎంపీడీవోగా దస్తగిరి బాబు

కొలిమిగుండ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల ఎంపీడీవోగా దస్తగిరిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బేతంచెర్ల ఎంపీడీవో కార్యాలయం ఏవోగా ఉన్న దస్తగిరిబాబుకు ఉన్నతాధికారులు పదోన్నతి కల్పిస్తూ కొలిమిగుండ్ల ఎంపీడీవోగా బదిలీ చేశారు. దీంతో ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాదరెడ్డి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. కాగా చాలా కాలంగా ఇన్‌చార్జి పాలనలో నడుస్తున్న కొలిమిగుండ్ల మండలానికి రెగ్యులర్ ఎంపీడీవో రావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

ఆళ్లగడ్డ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంత డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ ఏపీడబ్ల్యూజేఎఫ్ కార్యవర్గ సభ్యులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏపీ డబ్ల్యూజేఎఫ్ ఆళ్లగడ్డ శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర సభ్యులు ముల్లా నిజామోద్దీన్, ట్రెజరర్ నాగరాజు, సభ్యులు ప్రసాద్, శ్రీనివాసులు, మహ్మద్‌హుసేన్, దర్శన్, డిడి బాషా పాల్గొన్నారు.



పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



కొలిమిగుండ్లలో జ్వాలా తోరణం సేవలో పాల్గొన్న సీఐ రమేష్‌బాబు, గ్రామ పెద్దలు



డోన్‌లో ప్రత్యేక అలంకరణలో పాతబుగ్గ రామలింగేశ్వరుడు



యాగంటిలో దీపోత్సవంలో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

- యాగంటిలో లక్ష దీపోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- అన్నదాన కార్యక్రమాలు

బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్ నియోజవర్గాల వ్యాప్తంగా ఆయా మండలాల్లోని గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి క్షేత్రంలో బుధవా రం లక్షదీపోత్సవం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు, మహిళలు ఉమామహేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టీడీపీ నాయకులురాలు బీసీ ఇందిరమ్మ లక్ష దీపోత్సవంలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఆకాశదీపాలు, కార్తీక దీపాలు వెలగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. డోన్ పట్టణంలోని పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజ లు చేశారు. పలు చోట్ల ఆల యాల వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

– ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



బేతంచెర్ల: పూదోటమఠంలో జ్వాలా తోరణం వెలిగిస్తున్న భక్తులు



మూడురాళ్లపల్లెలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న వేద పండితులు



భాగ్యనగరం ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు




నల్లమలలోని ఉల్లెడకొండ గుహల వద్ద భక్తులు



శివాలయంలో భక్తుల సందడి



దొర్నిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కొలిమిగుండ్లలో స్వామి వారి గ్రామోత్సవం



భీమలింగేశ్వర ఆలయంలో వెలిగించిన జ్వాలా తోరణం



రామలింగేశ్వర ఆలయంలో జ్వాలా తోరణం వెలిగిస్తున్న అభినవ శంకరానంద స్వామిజీ



అవుకులో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



బేతంచెర్ల: ముచ్చట్ల మల్లికార్జున స్వామి క్షేత్రంలో..

బెలుంలో భారీ వర్షం

శివాలయంలోకి ప్రవేశించిన నీరు





మునిగిపోయిన సిద్ధరామేశ్వరస్వామి శివలింగం, కునుకుంట్ల-ఉప్పలపాడు గ్రామాల మధ్య పొంగి ప్రవహిస్తున్న వంక

కొలిమిగుండ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం గ్రామంలో బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బెలుం, బెలుంశింగవరం, మీర్జాపురం గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. దీంతో గ్రామ పరిసరాల్లోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. మరోవైపు బెలుం గ్రామంలోని సిద్ధ రామేశ్వరస్వామి ఆలయంలోకి వర్షపు నీరు చేరింది. ఆలయంలోని శివలింగం, నందీశ్వరుడు వరద నీటిలో మునిగిపోయింది.

ఎర్రమల కొండల్లో భారీ వర్షం

అవుకు: అవుకు మండలం ఎర్రమల కొండల్లో సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో కొండమీది గ్రామాలైన కొండమనాయునిపల్లె, జూనూ తల, ఉప్పలపాడు, కునుకుంట్ల గ్రామాల్లోని వాగులు, వంకలు పొంగి పొర్లాయి. కునుకుంట్ల-ఉప్పలపాడు గ్రామాల మధ్య ఉన్న కాల్వగడ్డ వంక పొంగిపొర్లడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్‌టీసీ బస్సు కునుకుంట్లలోనే నిలచిపోయింది. ఎర్రమల కొండల్లో కురిసిన వర్షంతో ఎత్తిపోతల ద్వారా అవుకు రిజర్వాయర్‌కు భారీగా నీరు వచ్చి చేరుతోంది.

స్వదేశీ వస్తువులనే వాడాలి: బీజేపీ



తిమ్మనాయునిపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అభిరుచి మధు

కొలిమిగుండ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులనే వాడాలని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. బుధవారం కొలిమిగుండ్ల మండలంలోని తిమ్మనాయునిపేట గ్రామంలో ఆయన పర్యటించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఇంటింటా స్వదేశీ కార్యక్ర మంలో పాల్గొని ఇంటి వద్ద స్టిక్కర్లు అందించి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకట సుబ్బయ్య, బీజేపీ మండల అధ్యక్షులు రామసుబ్బయ్య, తిరుమలయ్య, రామకృష్ణ, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

డోన్ టౌన్: బీజేపీ ఆదేశాల మేరకు పార్టీ పట్టణ అధ్యక్షుడు బద్రి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు సందువెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రతి ఇంటికి వెళ్లి, పాతబస్టాండు గాంధీ చౌక్‌లో దుకాణాలకు, ఆటోలకు స్టిక్కర్లు అతికించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాదుల సుబ్రహ్మణ్యం, బొంకూరి రవికుమార్, భరణి రమేష్, కులేరు రామయ్య, కమలేష్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

● అలాగే బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి బుధవారం ఆత్మనిర్బర్ భార్ అనే నినాదంతో ప్రతి ఇంట స్వదేశీ, ఉత్పత్తులను ఉపయోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హెచ్‌కే నాయుడు, జీవీ చలపతిరావు, వేమారెడ్డి, చాంద్‌బాషా, రామ మద్దయ్య, నవీన్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ గ్రామోత్సవం

చాగలమర్రి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలో కార్తీక మాసం సందర్భంగా గౌరమ్మ ప్రతిమచే బుధవారం ఆర్యవైశ్య మహిళలు సామూ హికంగా గ్రామోత్సవం నిర్వహించారు. గౌరమ్మను కుమ్మరివారి ఇంటి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి ఆల యంలో గౌరమ్మను ప్రతిష్ఠించారు. 9వ తేదీ వరకు గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్ర మంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు, కార్యదర్శి నవతాప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

దళితులపై దాడి అమానుషం

బేతంచెర్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం బండ్లముడి గ్రామంలో దళితులపై టీడీపీ వర్గీయులు దాడి చేయడం అమానుషమని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య మాదిగ అన్నారు. బుధవారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ కార్యాలయం ప్రాంగణంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

అవుకు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన కాశీవిశ్వ నాథస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గతంలో శివాలయంలో చెక్కతో ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభం శిధిలావస్థకు చేరుకోవడంతో అర్చకుడు శంకరశర్మ సొంత నిధులతో ధ్వంజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 3వతేదీ నుంచి ధ్వజస్తంభానికి విశేష పూజలు నిర్వహించి కార్తీక పౌర్ణమి రోజున ఉద యం 10.37 గంటలకు ప్రతిష్ఠించారు.

వాసాపురంలో హోమాలు

రుద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాసాపురంలో బుధవారం హోమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వారణాసి గోపిశర్మ ఆధ్వర్యంలో ఐదుగురు రుత్వికులు, 25 జంటలతో హోమాలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యామవచనం నవగ్రహ మండపారాధనతోపాటు రుద్ర, నవగ్రహ, సుదనర్శన చండీ హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. మానస లింగేశ్వరస్వామి త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. ఈకార్యక్రమానికి నంద్యాల, కర్నూలు, కడప జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మధుసూదనరెడ్డి, వైస్ చైర్మన్ రంగనాయకులు, కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి పడి పూజ

డోన్ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గుండాల జగన్ ఇంటి ప్రాంగణంలో అయ్యప్పస్వామి పడి పూజా కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే డోన్ టీడీపీ యువ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి హాజరై స్వామివారికి పూజలు చేశారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష

బనగానపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రవ్వలకొండలో వెలసిన వీరబ్ర హ్మేంద్రస్వామి ఆలయంలో అయ్యప్పస్వాములకు గుండ్లశిం గవరం సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి బుధవారం అయ్యప్ప స్వాములకు భిక్ష వడ్డించారు. కాటసాని తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితుల బ్యాంకు ఖాతాలపై విచారణ

దొర్నిపాడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హెల్త్ అండ్ వెల్త్ ఫైనాన్సియల్ కంపెనీలో డబ్బులు పెట్టి మోసపోయిన బాధితులకు న్యాయం చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్‌ఐ రామిరెడ్డి అన్నారు. బుధవారం దొర్నిపాడు యూనియన్ బ్యాంకులో బాధితుల ఖాతాలను తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ కంపెనీలో డబ్బులు పెట్టి మోసపోయిన బాధితుల బ్యాంకు ఖాతాను పరిశీలించామన్నారు.

తగ్గని వరద నీరు

కుళ్లిన మొక్కజొన్న



కుళ్లిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతులు

చాగలమర్రి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని గోపాయపల్లె రహదారిలోగల పొలాలు మళ్లీ కురిసిన వర్షంతో నీరు పంట పొలాల్లో ప్రవహించి మొక్కజొన్న రైతులను ముంచేసింది. వరద నీరు తగ్గకపోవడంతో మొక్కజొన్న కుళ్లిపోయి భారీ నష్టం వాటిల్లింది. వరద నీరు తగ్గకపోవడంతో కోత కోసిన కంకులు కూడా తడిచి కుళ్లిపో యాయి. 200 ఎకరాల దాక పంట దెబ్బతిని రైతులకు తీరని నష్టం వాటిల్లింది.

3 వేల ఎకరాల్లో పంట నష్టం: మండలంలో మొంథా తుపాన్ ప్రభావంతో 3 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచన వేశామని ఏవో రంగనేతాజీ తెలిపారు. బుధవారం చింతలచెరువు గ్రామంలో దెబ్బతిన్న మినుము పంటను ఆయన పరిశీలించారు.

ఉల్లి రైతుకు నష్టం

అరబెట్టిన పంటను తొక్కేసిన గుర్తుతెలియని వాహనం



వాహనం తొక్కడంతో నుజ్జుయిన ఉల్లి

కొలిమిగుండ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో రహదారిలో రైతు ఆరబెట్టుకున్న ఉల్లి దిగుబడిపై గుర్తు తెలియని వాహనం తొక్కడంతో ఆ రైతుకు తీవ్ర నష్టం కలిగింది. కొలిమిగుండ్ల మండలం కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన రైతు అమీర్‌బాషా 2.5ఎకరాల్లో ఉల్లి సాగు చేశాడు. ఇటీవల పంటను కోసి, గ్రామ సమీపంలోని గిద్దలూరు రహదారిలో ఆరబెట్టుకున్నాడు. అయితే బుధవారం రైతు లేని సమయంలో ఉల్లిగడ్డలపై గుర్తు తెలియని వ్యక్తి వాహనాన్ని ఎక్కించాడు. దీంతో సుమారు 80 ప్యాకెట్లకు పైగా ఉల్లిగడ్డలు దెబ్బతిన్నట్లు రైతు వాపోయాడు.

లోకేశ్‌ను కలిసిన శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్

డోన్ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మరి సుధాకర్ మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుమ్మరి వృత్తిదారులకు ఎలక్ట్రానిక్ పరికరాలు అందించి ఉపాధి కల్పించాలని మంత్రిని కోరారు. రాష్ట్రంలోని శాలివాహనులకు కార్పొరేషన్ కింద రుణాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లోకేశ్‌ను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్

ప్యాపిలి: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం అమరావ తిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వర రావుయాద్ కలిశారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్‌కు నిధులు మంజూరు చేసి బలోపేతం చేయాలని కోరినట్లు నాగేశ్వరరావు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంజామల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాలివి.. మండలంలోని హోత్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన యన్నం నాగకిశోర్ రెడ్డి ఈనెల 3న ఆకుమళ్ల నుంచి హోత్రమాన్‌దిన్నెకు మోటారు సైకిల్‌పై వెళ్తూ కమ్మవారి కుంట వద్ద కింద పడి గాయపడ్డాడు. అతడిని నంద్యాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహానికి శవ పరీక్ష చేయించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.